బులుసు-జీ-ప్రకాష్

# లోగుట్టు

ఇహ లాభం లేదు. ఇహ ఊరుకుని లాభం లేదు. మండల రెవెన్యూ అధికారి చుట్టూ తిరిగీ తిరిగీ విసిగి వేసారిపోయాను. సూర్యుడు తన చుట్టూ తాను తిరుగుతూ భూమి చుట్టూ తిరగడానికయినన్ని రోజులు గడచిపోయాయి. నాలుగు చెప్పుల జతలు అరిగిపోయాయి. అవి ఏ గుడి దగ్గరో కొట్టేసినవి కావు. కష్టపడి కొనుక్కున్నవి! మా అబ్బాయి స్కూల్లో ఎడ్మిషన్‌కని ఓ పత్రం కోసం తిరుగుతున్నాను. ఆ ఎమ్మార్వోగారు అది ఇవ్వడం లేదు. ఏవో కుంటిసాకులు చెప్పి తిప్పి చంపుతున్నారు. రెండు వందలు అమ్యామ్యా ఇచ్చినవాళ్లకి క్షణాలమీద ఇచ్చేస్తున్నారు. నేనెందుకివ్వాలి? లంచం ఇవ్వడం కూడా నేరమే కదా?

తిన్నగా అవినీతి నిరోధక శాఖ కార్యాలయంలో అడుగుపెట్టాను. వ్రాతపూర్వకంగా ఫిర్యాదు దాఖలు చేశాను. అక్కడ డివిఎస్పిగారు కొన్ని సూచనలు చేశారు. "సోడియం కార్బొనేట్ పూసి, ఫినాప్తలీన్ పొడరు జల్లిన వంద కాయితాలు మీకిస్తాం. అవి మీరు ఎమ్మార్వోగారికి ఓ కవర్లో పెట్టి యివ్వండి. బయటికొచ్చి మీ చేతి రుమాలుతో ముఖం తుడుచుకోండి. మారు వేషాల్లో అక్కడ చెట్ల క్రింద వున్న మేము చూసి, వెంటనే ఎమ్మార్వోని పట్టేసి, అతని చేతుల్ని నీళ్లలో ముంచుతాం, ఆ నీళ్ళు లేత గులాబీరంగుగా మారతాయి. తరువాత అతన్ని అరెస్టుచేసి, సస్పెండ్ చేయమని కలక్టర్‌కి సిఫార్స్ చేస్తాం" అన్నారు.

"ఒరేయ్ ఎమ్మార్వో! నీ రోజులు దగ్గర పడ్డాయిరా!" అని వికటాట్టహాసం మనసులోనే చేసుకుంటూ ఎమ్మార్వో ఆఫీసులో అడుగుపెట్టాను. ఆ రెండువందల నోట్లనీ ఓ కవరులో పెట్టి ఎమ్మార్వోకి నమస్కరిస్తూ ఇవ్వబోయాను. ఎమ్మార్వో అది చూసి "నేనేం లంచగొండి ననుకున్నావా? ఎవర్రా నువ్వు? గెటవుట్!" అంటూ ఎటెండర్ చేత నన్ను బయటకు గెంటించాడు. నా ప్రయత్నం వృధా అయింది. మారువేషాల్లో వున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు, తమకు ప్రమోషన్ రావలసిన మంచి కేసు పోయిందని బాధపడుతూ వెళ్లిపోయారు.

నాకు తరువాత్తెలిసిన లోగుట్టు-ఆ అవినీతి నిరోధక శాఖ డివిఎస్పిగారూ, ఎమ్మార్వోగారూ లోగడ క్లాస్‌మేట్సట! ముందుగా ఆయనకు కబురుపెట్టి జాగ్రత్త పడమన్నార-ట! ట సుమండీ!

3-4-1997

ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక